

గ్రామాల్లో రోడ్ల నిర్మాణమే లక్ష్యం

గసభ సిపిఎం సర్పంచ్ సునీత

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:రోడ్డు లేని మారుమూల గ్రామంలో రోడ్లు నిర్మించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని గసభ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి.సునీత చెప్పారు. ఆ పంచాయతీ జంగిడివలస గ్రామంలో సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ 3లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని కోరారు. ప్రజలు సహకారం అదించాలనీ చెప్పారు. ఈ కార్యక్రమంలో గసబ మాజీ సర్పంచ్ పాంగి. సురేష్ కుమార్, వార్డ్ మెంబర్స్ పి సత్యనారాయణ, కిల్లో. క్రిష్ణ, ఫీసా కార్యదర్శి వి మోస్యా, పద్దు. బాస్కరరావు, సిపిఎం నాయకులు పాంగి. దొరబాబు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

కార్మికుల హక్కులను హరించే

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి



పాడేరులో నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-పాడేరు:కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని పాడేరు మెయిన్ రోడ్‌లోని జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం 11 జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లేబర్ కోడ్ల అమలు కోసం కేంద్రం ఇచ్చిన నోట్ ఫైల్ ఆదేశాల ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు మాట్లాడుతూ, ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులు, ప్రయోజనాలను తొలగించి ఈ కోడ్‌లను పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా రూపొందించడం జరిగిందని విమర్శించారు. 8 గంటల పని దినాన్ని 12: గంటలకు పెంచడం ఎవరికి లాభమని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్క అడుగు ముందుకేసి, 13 గంటలు పనిచేయించుకోవచ్చని పిలిపిచ్చారన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి, గతంలో వైసిపి ఎవరు పక్కన నిలబడ్డారో, కార్మికులు గుర్తించాలని తెలిపారు. అంగన్వాడి, ఆశ, ఆనిమేటర్, మధ్యాహ్న భోజనం, వంటి స్కీం వర్కర్లు కూడా కార్మికులే, అన్ని చట్టాలు వర్తిస్తాయని తీర్పులిచ్చినా పాలకవర్గాల అమలు చేయలేదన్నారు.

దేశంలో కార్మికుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం 1942లో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటుచేసిందన్నారు. 29 కార్మిక చట్టాల స్థానంలో లోబర్ కోడ్స్ అమలు చేస్తారన్నారు. పాత చట్టాల స్థానంలో వచ్చిన కొత్త కోడ్‌లు ఏ విధంగా కార్మిక ప్రయోజనాలను కాపాడలేవన్నారు. పారిశ్రామికవేత్తలకు, కార్పోరేట్లకు లాభాలకు దోపిడీలకు, ఆటంకం లేకుండా ఈ లేబర్ కోడ్‌లు తెచ్చారన్నారు కేంద్రం తెచ్చిన ఈ కోడ్‌లు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే ఆచరణలోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో, ప్రభుత్వ హాస్పిటల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ముత్యాలమ్మ, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు రాజు పాల్గొన్నారు.

అరకులోయరూరల్:లేబర్స్ కోడ్స్‌తో కేంద్ర ప్రభుత్వం పని గంటలను పెంచుతూ, కార్మిక చట్టాలను బలహీన పరుస్తోందని కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. బుధవారం అరకువేలి తహశీల్దార్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాలు నిరసన చేపట్టాయి. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సిఐటియు, కాంగ్రెస్ నేతలు ఐక్యవేదికగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పాచిపెంట చిన్నస్వామి, కిశాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాంగి గంగాధర్ మాట్లాడుతూ, కార్మికులు ప్రాణాలు అర్పించి సాధించిన ఎనిమిది గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచడం కార్మికులపై దాడి చేయడమేనని విమర్శించారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తూ పాలన కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. ఇటువంటి నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు దేశవ్యాప్తంగా పోరాడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పాంగి రామన్న, సోడపల్లి ఐసుబాబు, ఓబిసి జిల్లా చైర్మన్ ప్రవీణ్ కుమార్,మహిళా నాయకురాలు కొర్ర మితుల, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ నిరసన ర్యాలీ, అనంతరం అంబేద్కర్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. లేబర్‌కోడ్ నోటిపై ఫైల్స్ ప్రతులను దగ్ధం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, ఉపాధ్యక్షులు పి.రామరాజు, కంభం శాంతిరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లెరెడ్డి పాల్గొన్నారు. పల్లపు వెంకట్ మాట్లాడుతూ కార్మికుల సమ్మె హక్కు, సంఘాల ఏర్పాటు, చట్టపరమైన రక్షణ వంటి వాటికి కొత్తగా ప్రవేశపెట్టే లేబర్‌కోడ్స్ వల్ల తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. కార్మికుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



అరకులోయలో నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు



ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

అధ్వానంగా శిరమయ్యగుంపు రహదారి

గుంతలు పూడ్చిన యువత

ప్రజాశక్తి -విఆర్‌పురం: మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీలో గల చిన్నమ్మటపల్లిలో శిరమయ్య గుంపునకు వెళ్లే రోడ్డు చాలా దారుణమైన గుంతలు ఉన్నాయి. వాహనదారులకి చాలా ఇబ్బందిగా ఉంది. బుధవారం కారం సత్తిబాబు, కారం నాగేంద్ర గుంతల్లో మట్టి వేసి పూడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని అన్నారు. సిరమయ్య గుంపు వెళ్లే రోడ్డు రాళ్లు తేలి గుంతలు గుంతలుగా ఉండటంతో వాహనాలు దారులకు ప్రజలకు కూడా తిరగలేని పరిస్థితి ఉందని వాహనాలు రిపేర్లు ఎక్కువ అవుతున్నాయని ఈ గుంపు నుండి చిన్న పిల్లలు పాఠశాలకు వెళ్లే క్రమంలో కింద పడటం గాయాలు అవటం కూడా జరుగుతోందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సిసి రోడ్డు వేయాలని అధికారులను డిమాండ్ చేశారు.



రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న దృశ్యం



మాట్లాడుతున్న పులి సంతోష్ కుమార్

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- విఆర్‌పురం: ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు కుంజ శ్రీనుపై మంగళవారం జరిగిన దాడిని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ క్వారీ విషయమై గత కొంతకాలంగా వివాదం నెలకొందని ఆ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమని ప్రశ్నించిన కుంజ శ్రీనుపై దాడి చేశారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి క్వారీ అక్రమాల విషయంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, పూనెం ప్రదీప్ కుమార్, బాబు బోరయ్య పులి బోజ్జి, మొట్టు రాజయ్య, పోడియం శ్రీరామ్‌మూర్తి, పూసం రవివర్మ ప్రకటనలో కోరారు.



మాట్లాడుతున్న బుల్లిబాబు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి

ప్రజాశక్తి- రంపచోడవరం : స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శతక బుల్లిబాబు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్క రిసార్ట్స్‌లో పిసిసి ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఎఐసిసి అబ్జర్వర్ దెబోసిస్ పట్నాయక్ మండల అధ్యక్షులు, జిల్లాల కో ఆర్డినేటర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల రాబోతున్నాయని ముందుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులను పార్టీ మాజీ నాయకులను పార్టీలోకి ఆహ్వానించాలని సూచించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కోఆర్డినేటర్ పల్లాల రామలక్ష్మి పీసిసి డెలిగేట్ దంగేటి సత్తిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్ సత్యనారాయణ మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు. ఎఐసిసి అబ్జర్వర్ చేతుల మీదుగా రంపచోడ వరం, అడ్డతీగల, గంగవరం మండలాలకు అధ్యక్షులుగా నక్క బాల శివరామకృష్ణ, దంగేటి సత్తిబాబు, ఎన్.దుర్గాప్రసాద్‌లకు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పిటిసి బేబీరాణి

గంగవరంలో బేటీ బచావో బేటీ పడావో

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండల కేంద్రం మండల రిసోర్స్ సెంటర్లో బేటీ బచావో- బేటీ పడావో అనే కార్యక్రమం సిడిపిఒ సుచరిత ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పిటిసి బేబీరాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగడం వలన కలిగే నష్టాలు వివరించారు. ఎంపిపి పల్లాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించే ముందు ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లేదా గ్రామపెద్దలకు సమాచారం ఇచ్చి కార్యక్రమం నిర్వహించాలని కోరారు. తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ లక్ష్మణరావు, ఎంఈఓ 2 మల్లేశ్వరరావు, డాక్టర భావన, హేమలత, అప్పలకొండ,ఐసిడిఎస్ సూపర్వైజర్స్ కె.కుమారి, పి.సీత వీఆర్వోలు, ఏఎన్ఎంలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తాతబ్బాయిదొర కుటుంబ సభ్యులకు నగదు ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎంఇఒ తాతబ్బాయి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కురసం తాతబ్బాయిదొర (ఎంఇఒ, వై.రామవరం) కుటుంబానికి యుటిఎఫ్ నాయకులు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం సేకరించిన నగదును వారి కుటుంబ సభ్యులకు ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు రంపచోడవరం ఎంఇఒ కె. సత్యనారాయణదొర, టి.సూరయ్యరెడ్డి చేతుల మీదగా రూ. లక్ష రూపాయలు అందజేశారు. యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుబ్బారావు, కానీ శ్రీను, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా ప్రత్యేక కార్యదర్శి బుజ్జయ్య , కుటుంబ సంక్షేమ బోర్డు డైరెక్టర్ పైడిమల్లి, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ప్రత్యేక జిల్లా ప్రకటనపై హర్షం

ప్రజాశక్తి- విఆర్‌పురం: ఇచ్చిన హామీ మేరకు పోలవరం ప్రత్యేక జిల్లాగా చంద్రబాబు ప్రకటించారని మండల టిడిపి అధ్యక్షులు బొర్రా నరేష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం రేకపల్లి పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బొర్రా నరేష్ కుమార్ మాట్లాడుతూ మండల ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, ఎంపిటిసి వాళ్ళ వెంకటేశ్వర్, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని జనసేన మండల అధ్యక్షులు కుంజం సిద్దు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రతిపక్షంలో వున్నప్పుడు ఇచ్చిన మాట ప్రకారం పోలవరాన్ని జిల్లాగా ప్రకటించారని, అధికారంలోకి వచ్చాక మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు అని కొనియాడారు.



రామారావుకు నగదు అందిస్తున్న జమాల్‌ఖాన్

అగ్ని ప్రమాద బాధితునికి వితరణ

ప్రజాశక్తి - చింతూరు: మండలంలోని ఏడుగురాళ్లపల్లి పంచాయతీ కాటుకపల్లి గ్రామానికి చెందిన కుంజా రామారావుకు చెందిన ఇల్లు మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న జేకేసీ ట్రస్ట్ చైర్మన్ చింతూరు మండల టీడీపీ అధ్యక్షులు మహమ్మద్ జమాల్‌ఖాన్ బాధితుని బుధవారం పరామర్శించారు. ట్రస్ట్ ద్వారా సహాయం చేస్తామని తెలిపారు. వెంటనే 10 రేకులు,10 పైపులు,20 కేజీల బియ్యం, రూ.5వేలు నగదు అందించారు. కార్యక్రమంలో బొర్రా నరేష్, పి.సల్మాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి మిరియాల

- డిసెంబర్ 14న జయంతి వేడుకలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: మహోన్నత వ్యక్తి మిరియాల అని జనసేన పార్టీ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ కొనియాడారు. దివంగత మిరియాల వెంకటరావు 86వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో విసత ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఉపాకిరణ్‌తో పాటు పసుపులేటి శేఖర్ మాట్లాడుతూ డిసెంబర్ 14 న నగరంలో వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణం లో వేడుకలను నిర్వహిస్తామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో పలువురు ప్రముఖులతో సన్నిహితంగా మెలగడంతో పాటు తనదైన శైలిలో సహాయ కార్యక్రమాలు నిర్వహించిన ఘనత మిరియాలకే దక్కుతుంద న్నారు. ఆయనపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని, ఆయన కుమారుడు సీనియర్ ఐఎఎస్ అధికారి మిరియాల శేషగిరిబాబు ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ఆ రోజు ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. ఆహ్వాన కమిటీ తరపున గంట్ల శ్రీనుబాబు, కె.వి.వి సత్యనారాయణ, జెర్రి పోతుల మోహన్ కుమార్ మిరియాల ఆశయ సాధనకు తామంతా కషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కోటపోతుల శ్రీనివాస్, ఆకుల మురళి, సుబ్బు విశ్వనాథ్ తదితరులు జయంతి వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

ఎటపాక ఎంపిడిఒగా విజయ దత్

ప్రజాశక్తి ఎటపాక: ఎటపాక నూతన ఎంపీడీవోగా ఎల్ విజయదత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కుప్పం నుండి పదోన్నతిపై ఎటపాక ఎంపీడీవో గా బదిలీ అయ్యారు. కాగా బుధవారం నాడు ఎటపాక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. విజయదత్‌కి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పూలగుచ్చం అందించి స్వాగతం పలికారు.

28 నుంచి ఇండియన్ ఆర్థోడాంటిక్ సమావేశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖలో 59వ ఇండియన్ ఆర్థోడాంటిక్ సమావేశాలు ఈనెల 28 నుంచి 30 వరకు విశాఖలోని రాడిషన్ బ్లూ హెూటల్ లో జరగనున్నాయని ఇండియన్ ఆర్థోడాంటిక్ కాన్ఫరెన్స్ నిర్వాహక కమిటీ చైర్మన్ శ్రీకష్ణ చలసాని తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 28 న సాయంత్రం 5 గంటలు రాడిసన్ బ్లూ రిసార్ట్స్‌లో జరిగే జాతీయ 59వ ఇండియన్ ఆర్థోడాంటిక్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం.శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తెలంగాణ ఎమ్మెల్యే డాక్టర్ కె.రాజేష్ రెడ్డి,ఇండియన్ ఆర్థోడాంటిక్ సొసైటీ గౌరవ కార్యదర్శి డాక్టర్ సంజయ్‌లాభ్ హాజరవుతారని తెలిపారు.

ఐటిఐ అభ్యర్థులకు ఆర్టీసీలో నియామకాలు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్ : డీజిల్ మెకానిక్, వెల్డర్, పెయింటర్ ట్రేడుల్లో ఎంపికైన 12 మంది ఐటిఐ అభ్యర్థులకు, ఏపీఎస్‌ఆర్టీసీ విశాఖ జిల్లాకు సంబంధించి వివిధ డిపోల్లో అప్రెంటిస్ నియామక పత్రాలను ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు బుధవారం జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అప్రెంటిస్ అభ్యర్థి, పూర్తి అంకితభావంతో, అప్రెంటిస్‌షిప్ పూర్తిచేయాలన్నారు. అప్రెంటిస్‌లుగా నియామకం పొందిన అభ్యర్థులకు నెలకు రూ.9,600 ఉపకార వేతనం ఇవ్వ బడునని తెలిపారు. బస్సుల నిర్వహణ ఎప్పటికప్పుడు చేస్తూ, మంచి కండిషన్‌తో బస్సులను నడుపుటకు, ఐటిఐ పూర్తి చేసిన అభ్యర్థులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించుటకు ఐటిఐ ఇన్స్టిట్యూట్‌ల ద్వారా అభ్యర్థుల వివరాలను సేకరించి వారిని తమ తమ డిపోల్లో నియమించుకోవాలని డిపో మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఎ.గంగాధరరావు, పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) జి.శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ (పర్సనల్) బి.వి.రమణ పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న యూనియన్ నేతలు

ఆర్‌టిసిలో అక్రమ సస్పెన్షన్లపై నిరసన

ప్రజాశక్తి- పాడేరు: ఏపీఎస్‌ఆర్టీసీ ఏలూరు డిపో పరిధిలోని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ సుందరయ్య తో పాటు మరో ఇద్దరిని అక్రమంగా సస్పెండ్ చేశారని, తక్షణమే ఎత్తివేయాలని ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఆధ్వర్యంలో పాడేరు ఆర్టీసీ డిపో వద్ద బుధవారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి లింగేరి .సుందరరావు, ఎస్ డబ్ల్యూఎఫ్ డిపో సెక్రెటరీ బి.వెంకటరావు మాట్లాడుతూ, ఆర్టీసీ యాజమాన్యం తప్పు కప్పి పుచ్చుకునేందుకు ఎలాంటి సంబంధము లేని వారిపై సస్పెన్షన్ వేటు వేయడం తగదన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి అసలు దోసులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. బాలక్రిష్ణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను విజయవంతం చేయాలనే మండలంలోని గిరిజన మ్యూజియంలో సిఐటియు మండల కన్వీనర్ జెన్నీ భగత్ రామ్ ఆధ్వర్యంలో బుధవారం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భగత్ రామ్ మాట్లాడుతూ, కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నాలుగు కార్మిక కోడ్లుగా మారుస్తూ కార్మికులను, కార్మిక వర్గానికి ఉద్యోగ భద్రత లేకుండా చేయాలని ప్రయత్నం చేస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించిన కార్మిక చట్టాలను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయన్నారు. విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు వి సింహాద్రి,దాడి రాజు,డి ఓనాది, చెట్టి, బురుందా, ఎస్ కమల, శివాజీ, రంభ, తులసమ్మ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ శ్రీపూజ

ప్రజాశక్తి-పాడేరు:

గ్రామ సభలో, రెవెన్యూ సదస్సులలో వచ్చిన ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. సహాయ కలెక్టర్ సాహిత్ తో కలిసి బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ కి సంబంధించిన రెవిన్యూ సమస్యలపై మండల తహసీల్దార్స్, డిప్యూటీ తహసీల్దార్స్, రెవిన్యూ ఇన్స్పెక్టర్స్ తో సమావేశం నిర్వహించారు. ఆయా మండలాలలో జరిగిన గ్రామ సభలు, రెవిన్యూ సదస్సులలో వచ్చిన భూ సమస్యలు, రీ సర్వే, కుల ధ్రువ సర్టిఫికెట్లు జారీ, కుటుంబ, ఇతర సమస్యల పై వచ్చిన ఫిర్యాదులపై సమీక్షించారు. సర్టిఫికెట్స్ పెండింగ్ లేకుండా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. పి జి ఆర్ ఎస్ గ్రీవెన్స్ పోర్టర్ లో పిటిషన్లు పునరావృతం జరగకుండా పరిష్కారం చూపాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి విఎస్ లోకేశ్వరరావు, జిల్లా రెవిన్యూ అధికారి అంబేద్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

సుంకరమెట్ట సర్పంచ్ చిన్నబాబు

ప్రజాశక్తి అరకులోయ రూరల్:తనపై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు సర్పంచ్ స్పష్టం చేశారు.పంచాయతీ అభివృద్ధిని చూడలేక ప్రతిపక్ష నాయకులు ప్రజలను రెచ్చగొట్టి దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని ఆయన అన్నారు. బుధవారం గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ, 2014లో హుదూద్ తుపాన్ కారణంగా పిరిబంద, బోయిగుడా, పైబోయిగుడా గ్రామాల్లో కొండచరియలు విరిగి పడడంతో 109 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. ఈ కుటుంబాల పునరావాసం కోసం అప్పటి ప్రభుత్వం సుంకరమెట్ట హెడ్‌క్వార్టర్‌లో మోడల్ కాలనీ నిర్మాణానికి ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇందుకోసం మొత్తం 6 ఎకరాల భూమి సేకరణ జరిగిందని, పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని పీఎంజన్ మన్ యోజనలో భాగంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించారని వివరించారు. ప్రస్తుతం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూడలేక నాయకులు తప్పుడు వివరాలు చెప్పి ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని సర్పంచ్ విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్న నాయకులు ప్రజల ప్రయోజనాల కోసం ఏ ఒక్క పని చేయలేదని, ప్రస్తుతం సిపిఎం బలపరిచిన తన పరిపాలన ప్రజాదరణ పొందుతున్నందుకు కొందరు అసహనం చూపిస్తున్నారన్నారు. తాజాగా సుంకరమెట్ట పంచాయతీ జిల్లాలో ఉత్తమ పరిపాలన అవార్డు అందుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సిహెచ్ గురుమూర్తి, పి. నాని బాబు, నాయకులు పి. రాము, కె. గాసి, పిరిబంద, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నబాబు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



పాడేరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెసి శ్రీపూజ

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఇంచార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్యాలయ సిబ్బంది, అధికారులందరితో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ కే సాహిత్, ఇంచార్జ జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్,, డివిజనల్ రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, కలెక్టరేట్ ఏఓ, కలెక్టరేట్ వివిధ విభాగల సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అరకులోయ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు, పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటాన్ని పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ హెచ్. ఓ.డి. కే.ధర్మారావు, డాక్టర్ కే స్వర్ణలత, ఎన్ నాగేశ్వరరావు, డాక్టర్ సుభాన్ బొడ్నాయక్, డాక్టర్ సిహెచ్ మురళీకృష్ణ పాల్గొన్నారు. వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

చింతపల్లి : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా చింతపల్లి బాలుర సిహెచ్ స్కూల్‌లో ఎంఇఒలు పనసల ప్రసాద్, బోడెంనాయుడు, పాఠశాల హెచ్ఎం రామరాజు పడాల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజ్యాంగ భావాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి భారతీయుడి చేతుల్లో ఉన్న మహత్తర ఆయుధమని,దాని భావాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

అంబేద్కర్ ఆశయాలు ప్రతి గ్రామానికి చేరేలా కృషి చేయడం ప్రధాన ధ్యేయమని చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత వెల్లడించారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి జడ్పిటిసి పోతురాజు బాలయ్యతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి అంబేద్కర్, మంజేటి శ్రీను, పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పెదబయలు : రాజ్యాంగం అవతరణ దినోత్సవం సందర్భంగా పెదబయలు బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం ప్రిన్సిపాల్ ఎస్, శంకర్‌రావు ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. విద్యార్థుల పాలక, ప్రతిపక్ష సభ్యులుగా వ్యవహరించి, మాక్ అసెంబ్లీ నిర్వహించి ప్రశ్నోత్తరాలు, చర్చావేదిక కార్యక్రమాలను నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

రంపచోడవరం : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయునిపై ఉందని ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం ఐటిడిఎ సమావేశ హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయనతో పాటు రాష్ట్ర ఎస్టి కమిషన్ మెంబర్ గొర్లె సునీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రతి భారతీయుడు స్వేచ్ఛ స్వతంత్రంతో జీవించే విధంగా రాజ్యాంగ రచన చేశారన్నారు.


రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, సర్పంచ్ యం. బొజ్జయ్య పాల్గొన్నారు. అనంతరం రంపచోడవరం ఎపిఒ జనరల్ డివిఎన్వి రమణ వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

కొయ్యూరు: అందరూ ఒక్కటిగా ఉండేలా చేసిన ఘనత రాజ్యాంగానిదే అని కొయ్యూరు ఎంపిడిఒ ప్రసాదరావు సూచించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధి పథకం, పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

చింతూరు: చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో పిఒ శుభం నోఖ్వల్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. పిఒ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఓ రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లిశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలం చికిలింత పంచాయతీలో రాజ్యాంగ దినోత్సవం సర్పంచ్ సూరిబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గిరిజన ప్రాంతం నుండి అగ్నివీర్‌కి ఎంపికైన గిరిజన యువకుడు రాయికన్నారెడ్డి, అతని తండ్రి వంగా రెడ్డిని అభినందించారు. కూటమి నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ శంకర్రావు, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎపి జెన్కో ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. ఎడిఒ అప్పలనాయుడు, ఎఇఇ సురేష్ పాల్గొన్నారు.



చింతపల్లిలో పూలమాల వేస్తున్న నాయకులు

డిఎవి పాఠశాలలో..

స్థానిక డిఎవి పాఠశాలలో హెచ్ఎం కిరణ్‌కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులచే జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులకు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎటపాక : రాజ్యాంగ దినోత్సవం భారతీయుల పండుగ అని,ఆదిత్య స్కూల్ డైరెక్టర్ కడియాల వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకూ విద్యార్థులు అధికారపక్షం, ప్రతిపక్షం ఎమ్మెల్యేలు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్లుగా పాత్రలు పోషించారు. అసెంబ్లి సమావేశాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. క్విజ్ పోటీలు నిర్వహించారు.



అరకులోయలో నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు



చింతూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పిడినట్లు సిఐ జె.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన ఆర్.శ్రీనివాస్ (55) పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో బుధవారం వేకువజమున పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్ పిఎం.పాలెం ఆఖరి బస్ స్టాప్ వద్ద ఉన్న తన తల్లిని చూసేందుకు వచ్చినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కెజిహెచ్ శవాగారానికి తరలించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ప్రజాశక్తి- పాయకరావుపేట : మండలంలోని శ్రీరాంపురం గ్రామ శివారులో పోలీసులు దాడి చేసి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తినిఅరెస్టు చెసారు. పోలీసులకు అందిన సమాచారం దాడులు చేయగా, పోలీసులను చూసి పారిపోతున్న వ్యక్తిని ఏఎస్ఐ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఎటువంటి రసీదులు లేకుండా బెంగళూరు విస్కీ నాలుగు సీసాలు, ట్రాపికోనా బ్రాందీ 4 సీసాలు, మొత్తం 8 సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి, సర్పంచ్

అంగన్వాడీ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని కృష్ణాపురం అంగన్వాడి కేంద్రం అభివద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. జడ్పిటిసి పోతురాజు బాలయ్య నిధులతో అంగన్వాడి భవనానికి ప్రహరీ నిర్మాణ పనులకు బుధవారం జెడ్‌పిటిసి పోతురాజుతో కలిసి పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోపాల్ మాట్లాడుతూ పల్లెల్లో అంగన్వాడీ చిన్నారుల భవిష్యత్తుకు పునాదులు వేసే అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మాణంతో చిన్నారులకు భద్రత ఏర్పడుతుందన్నారు. జడ్పిటిసి పోతురాజు బాలయ్య మాట్లాడుతూ జడ్పిటిసి నిధులను ప్రజా ప్రయోజన కార్యక్రమాలకే వినియోగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లోవరాజు, అంగన్వాడి కార్యకర్త ఎం. సన్యాసమ్మ, అయా బురిటి బంగారమ్మ, గ్రామ పెద్దలు బురిటి ఆదినారాయణ, పిండి రమణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

అదనపు పిపిగా పార్థసారథి

ప్రజాశక్తి- లీగల్ : విశాఖపట్నం ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కం ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది కర్రి పార్థసారథిని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లా డిపార్ట్మెంట్ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ పదవిలో మూడేళ్లు విధులు నిర్వర్తించనున్నారు. ఈ పదవిలో నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు పార్థసారధి కృతజ్ఞతలు తెలిపారు. ఈయన నియామకం పట్ల విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లాలం పార్వతీనాయుడు, తెలుగుదేశం న్యాయవిభాగం రాష్ట్ర కార్య వర్గ నాయకులు మానం శోభన్ బాబు, నవ్యాంధ్ర న్యాయవాదుల సంఘం అధ్యక్షులు హరిహర రెడ్డి, ఉపాధ్యక్షులు పి.ఈశ్వరరావు, నాయుడు అభినందనలు తెలియజేశారు.

అదనపు ప్రభుత్వ న్యాయవాది బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- లీగల్ : విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయస్థానం, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా కన్నూరు అప్పలనాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం తరపున సమర్థవంతంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు.



పోటీల్లో తలపడుతున్న లోహిత్ కృష్ణ

కరాటే పోటీల్లో అక్కాతమ్ముళ్ల సత్తా

రాష్ట్రస్థాయి టోర్నీలో స్వర్ణ, రజత పతకాలు కైవసం

జాతీయ పోటీలకు ఎంపికైన ఏకలవ్య విద్యార్థులు

ప్రజాశక్తి. చింతపల్లి: కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే టోర్నమెంట్‌లో చింతపల్లి ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాల (ఇఎంఆర్ఎస్) విద్యార్థులు అద్భుత ప్రదర్శనతో సత్తా చాటారు. స్వర్ణ, రజత పతకాలను సాధించి పాఠశాల ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. జియు-జిట్సు ఆరవ ఎపి స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా 'స్పెరింగ్' విభాగంలో హోరాహోరీగా సాగిన పోటీల్లో అక్కాతమ్ముళ్లు సత్తా చాటారు. ఎనిమిదో తరగతి విద్యార్థిని పాడి జాస్మిని కష్ణప్రియ, అండర్-14 విభాగంలో 50 కేజీల బరువు కేటగిరీలో అద్భుతమైన పోరాట పటిమతో మొదటి స్థానం దక్కించుకుని స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. జాస్మిని తమ్ముడు ఆరో తరగతి విద్యార్థి పాడి లోహిత్ కృష్ణ, అండర్-12 విభాగంలో 30 కేజీల కేటగిరీలో ద్వితీయ స్థానం పొంది రజత పతకాన్ని సాధించాడు. వీరిద్దరూ ఒకే టోర్నమెంట్‌లో పతకాలు సాధించి చింతపల్లికి కీర్తి తెచ్చారు. రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రదర్శన చేసిన విద్యార్థులు ఇప్పుడు నేరుగా జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. త్వరలో ఉత్తరాఖండ్‌లో జరగనున్నజాతీయ టోర్నమెంట్‌లో వీరు ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. కరాటేలో సత్తాచాటి జాతీయ పోటీలకు ఎంపికైన పాడి జాస్మినీ కష్ణప్రియ, పాడి లోహిత్ కృష్ణలను చింతపల్లి ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు. జాతీయ పోటీల్లో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.



స్వర్ణ పతకం సాధించిన జాస్మికి పలువురి అభినందన

పన్నులు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: జివిఎంసి పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను, నీటి చార్జీలను సకాలంలో చెల్లించి విశాఖ నగర అభివృద్ధికి భవన యజమానులు సహకరించాలని జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని భవన యజమానులు, ఆస్తి ఖాళీ స్థలాల పన్నులను 2025-26 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తిపన్ను, ఖాళీస్థలం పన్ను బకాయిలు, మంచి నీటి కుళాయి చార్జీల బకాయిలను వెంటనే చెల్లించాలని కమిషనర్ తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని యెడల బకాయిదారుల ఆస్తులు జప్తు చేయబడునని కమిషనర్ తెలిపారు. కావున భవన యజమానులందరూ తక్షణమే మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కు చెల్లించవలసిన ఇంటి పన్ను, ఖాళీస్థలము పన్ను, మంచి నీటి కుళాయి చార్జీలను సకాలములో చెల్లించి, ఆస్తి జప్తులకు, వడ్డీలకు గురికాకుండా పన్నుల బకాయిలను వెంటనే చెల్లించాలని భవన యజమానుదారులకు కమిషనర్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



గంగవరం : కరపత్రాలు చూపుతున్న అధికారులు



అవగాహన కల్పిస్తున్నఅధికారులు

ప్రజాశక్తి- గంగవరం: కూటమి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి అన్నారు. బుధవారం గంగవరం మండలం పెద్ద అడ్డపల్లిలో రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక రైతుకు వ్యవసాయానికి పనిముట్లు ఏది అవసరమవుతుందో గుర్తించి ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు. మాజీ ఎంపీపీ తీగల ప్రభ, బూత్ ఇన్‌చార్జి ముర్రం నర్సన్నదొర, రేవుల అబ్బాయిరెడ్డి పాల్గొన్నారు.

వై.రామవరం: ఎర్రంరెడ్డిపాలెం పంచాయితీ, నువ్వగంటిపాలెం గ్రామంలో రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆదేశాల మేరకు రైతన్న కోసం కార్యక్రమంలో పాల్గొని రైతులకు కూటమి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల ఫలాలను అందిపుచ్చుకోవాలని రైతులకు సూచించారు.

దుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరమ పంచాయతీ గ్రామంలో బుధవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారి వాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అరమ పూలుగుడ ,బడిమెల తో పాటు పలు గ్రామాల్లో సందర్శించి రైతులకు వ్యవసాయ పనుల మెలకువలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారులు చెప్పిన మెలకువలను పాటిస్తే పంటల దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. దీని ద్వారా రైతులు ఆర్థికంగా కూడా అభివృద్ధి చెందవచ్చు అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ కే.సింహాచలం, అగ్రికల్చర్ అసిస్టెంట్ శాంతకుమారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లను వినియోగించుకోవాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణమూర్తి

ప్రజాశక్తి-హుకుంపేట: మండల పరిధిలోని హుకుంపేట, ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా హుకుంపేట పీహెచ్‌సీని సందర్శించిన ఆయన రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యాధికారి, సిబ్బందిని వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి గ్రామాలలో అధికంగా ప్రబలుతున్న వ్యాధులు, క్షేత్రస్థాయి సిబ్బంది సేవలపై సమాచారం సేకరించారు. వ్యాధుల సమయంలో నాటువైద్యులను ఆశ్రయించరాదని, పసర మందులు వాడకూడదని సూచించారు. తప్పనిసరిగా ప్రభుత్వ వైద్య సేవలు పొందాలని, అవసరమైతే వైద్యుల సలహాతో ఉన్నత ఆసుపత్రులకు వెళ్లాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణీలను వారం రోజుల ముందుగానే హుకుంపేట గర్భిణీల వసతి గృహానికి తరలించి సుఖప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తల్లిపాల ప్రాముఖ్యత, వ్యాధి నిరోధక టీకాలు, పౌష్టికాహారంపై విస్తత అవగాహన కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీలోని వార్డులు, ప్రసూతి గదిని పరిశీలించిన ఆయన, అపరిశుభ్రత కనిపించడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌ను పరిశీలించి రోజువారీ రక్త పరీక్షలు, మలేరియా కేసుల నమోదును, చికిత్స వివరాలను పరిశీలించారు.వ్యాక్సిన్‌లు సరిపడా నిల్వ ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, ప్రసూతి గదిని పరిశీలించారు. రోగులు, గర్భిణీలు ఐటీడీఏ అంబులెన్స్‌లు, 108, ఫీడర్ అంబులెన్స్‌లను వినియోగించుకోవాలని తెలిపారు. శీతాకాలంలో న్యూమోనియా చిన్నారులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో తీవ్రంగా వ్యాప్తిచెందే అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరి 2026 వరకు జిల్లావ్యాప్తంగా న్యూమోనియా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సౌజన్య, జె.అచ్యుత్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షునిగా కాకినాడ చిన్నబాబు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షునిగా కాకినాడ చిన్నబాబు నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అడ్డాల వెంకటవర్మ నియామకపత్రం ఆయనకు అందించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడు తూ 22 సంవత్సరాలుగా పార్టీలో వివిధ హోదాల్లో సేవలందిస్తున్నానని, జిల్లా ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, పిసిసి అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలరెడ్డి, డిసిసి అధ్యక్షులు అడ్డాల వెంకటవర్మలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తన మీద పెట్టిన బాధ్యతను గౌరవిస్తూ,పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. జిల్లా మహిళ ప్రెసిడెంట్ కాండవ గాయత్రి, మైనారిటీ సెల్ చైర్మన్ మహమ్మద్ అలీ కనేమార్ ,ఈస్ట్ ఇంచార్జ్ దండి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



దట్టంగా కురుస్తున్న మంచు

పొగమంచుతో అవస్థలు

ప్రజాశక్తి - వి ఆర్‌పురం : శీతాకాలం అధికం కావడంతో మన్యంలో గత మూడు రోజుల నుంచి దట్టమైన పొగ మంచు కురుస్తోంది. రోడ్డు కనబడక పోవడంతో రాకపోకలు సాగించే వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వస్తోంది. మండలంలో బుధవారం ఉదయం దట్టమైన పొగ మంచుకు చలి తీవ్రత కూడా ఎక్కువగా ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

విద్యార్థులకు ప్రశంసా పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని నియోజవర్గాల్లో ప్రతిభ ఆధారంగా ఎంపికైన 13 మంది విద్యార్థులకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రశంసాపత్రాలు, మెడల్స్ బహుకరించారు. కలెక్టర్ ఆధ్వర్యం లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలను కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిరప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమములో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్, ఉప విద్యాశాఖాధికారి ఎ.సోమేశ్వర రావు, మండల విద్యాశాఖాధికారులు, సంభందిత పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం విశిష్టమైన దని, దాని పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఉద్బోధించారు. జాతీయగీతాన్ని గౌరవిస్తున్నట్లే ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని కూడా గౌరవించాలన్నారు.

'మేఘాద్రి గెడ్డ'ను జివిఎంసికి అప్పగించేలా ప్రతిపాదనలు

- ఎపి శాసన సభా అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : క్షేత్రస్థాయి పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా ఉండే అంచనాలతోనే సత్ఫలితాలు సాధించగలుగుతామని ఎపి శాసన సభా అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. మేఘాద్రి గెడ్డ రిజర్వాయర్‌ను జివిఎంసికి అప్పగించేలా ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం విసి హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 2019-20, 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాలలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు, రూపొందించిన అంచనాలు, వ్యయం తదితర అంశాలపై కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జిల్లా అధికారులతో కలిసి చర్చించినట్లు తెలిపారు. అలాగే మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ ప్రస్తుతం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఉందని, దానికి మరమ్మతులు చేపట్టి జివిఎంసికి అప్పగించేందుకు అనుగుణంగా ప్రతిపాదనలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. సభ్యులు పలు అంశాలపై సలహాలు, సూచనలతో పాటు ప్రాజెక్టుల వ్యయం, అంచనాల రూపకల్పన తదితర అంశాలపై వారి అభిప్రాయాలను తెలిపారన్నారు. కమిటీ సభ్యులు వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వం కొన్ని లక్ష్యాలతో ఏ బడ్జెట్ అలకేషన్ చేసిందో, ఆయా డిపార్ట్‌మెంట్లవారీగా రివ్యూ చేస్తూ, ఆ లక్ష్యాలు చేరుకోగలిగామా, లేదా ? భవిష్యత్తులో ఎలాంటి మౌలిక వసతులు కల్పించాలనేదానిపై విభాగాల అధిపతులతో సమగ్రంగా సమీక్షించామన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు వరుదు కల్యాణి, ఏలూరి సాంబశివరావు, నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, పి.సూర్యనారాయణ, రాజు పాల్గొన్నారు.